సమస్యలపై సిడిపిఒకు అంగన్వాడీల వినతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అంగన్‌వాడీలు ఎదొర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ప్రాజెక్టు కమిటీ అధ్యక్షులు డి.ఆర్.మధురవాణి, ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి సిడిపిఒకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోట్ కెమరా రద్దు చేస్తూ, పెంచిన అద్దెలను అమలు చేయాలన్నారు. అన్ని యాప్‌లు కలిపి ఒకే యాప్‌గా చేసి పనిభారం తగ్గించాలని, ప్రింటింగ్ రిజిష్టర్లు ఇవ్వాలన్నారు. అర్హులైన హెల్పర్లకు ప్రమోషన్లు కల్పిస్తూ ఈవెంట్స్ జిల్లులు పెంచాలని కోరారు. బకాయి ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, మినీ వర్కర్స్ ను మెయిన్ వర్కర్స్ నా గుర్తించాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులను అరికట్టి పోషణ టాంకర్‌లో ఎఫ్ఆర్ఎస్ ను రద్దు చేయాలని కోరారు. ఆఫీసు వారు యిచ్చిన ఫోన్లు సరిగా పని చేయడం లేదని, నాణ్యమైన కొత్త ఫోన్లు ఇవ్వాలని, పెండింగ్ లో ఉన్న టిఎలు మంజూరు చేయాలని కోరారు.

సిడిపిఒకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పిడుగుపాటుకు ఇద్దరు దుర్మరణం

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- ఒకరి పరిస్థితి విషమం..కడపకు తరలింపు
- శెట్టిపల్లెలో తీవ్ర విషాదఛాయలు
- బాధిత కుటుంబాలను ఆదుకుంటాం : మంత్రి

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి టౌన్)

అన్నమయ్య జిల్లాలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందిన ఘోర సంఘటన చోటుచేసుకుంది. శెట్టిపల్లె గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. సంబేపల్లి మండలం, శెట్టిపల్లి గ్రామానికి చెందిన పలువురు వ్యవసాయ కూలీలు ఎస్.సోమవరం గ్రామంలో గుది సిద్దయ్య పొలంలో టమోటా పంట కోసేందుకు కూలి పనులకు వెళ్లారు. సోమవారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో భారీ వీదురుగాలులతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతూ ఎస్.సోమవరం గ్రామంలో పిడుగు పడింది. ఈ పిడుగుపాటుకు కూలి పనులకు వెళ్లిన దిగువ దళితవాడకు చెందిన శెట్టిపల్లి మల్లీశ్వరమ్మ (40), శెట్టిపల్లి శంకరమ్మ (43) అక్కడికక్కడే మృతి చెందారు. శెట్టిపల్లె కార్తీక్, శెట్టిపల్లె రెడ్డమ్మ, శెట్టిపల్లె మంగమ్మ, శెట్టిపల్లి జయమ్మ, శెట్టిపల్లి అమర్నాథ్ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందజేస్తున్నారు. కార్తీక్ పరిస్థితి విషమంగా ఉంటే మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారిస్తున్నారు. శెట్టిపల్లె గ్రామంలో తీవ్ర విషాద చాయలు నెలకొన్నాయి. ఈ ఘటనపై ఆరా తీసిన రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పిడుగుపాటుతో మరణించిన కుటుంబ సభ్యులను, గాయపడిన వారిని అన్ని విధాల ఆదుకుంటామని విజయవాడ క్యాంపు కార్యాలయం నుంచి మృతుల కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి బాధితులకు భరోసానిచ్చారు. బాధిత కుంటుబాలను అన్నివిధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

మృతి చెందిన శంకరమ్మ

మృతి చెందిన మల్లీశ్వరమ్మ

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళను పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : సిపిఎం

సంబేపల్లె మండలం ఎస్.సోమవరం గ్రామం బావులకాడపల్లెలో పిడుగుపాటుకు పిడుగుపాటుకు వ్యవసాయ మహిళా కూలీలు మృతి చెందడం పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సోమవారం పిడుగుపడి తీవ్రంగా గాయపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని సిపిఎం నాయకులు పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి రోజు కూలికి వెళ్తే కానీ పూట గడవని మహిళలు పిడుగుపాటు గురవడం బాధాకరమన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వం వారి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిడిగుపాటుతో తీవ్రంగా గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని, వైద్య ఖర్చులకు రూ.5 లక్షలు ఇవ్వాలని సిపిఎం పార్టీగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి : వైసిపి

పిడుగుపాటుకు మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గడికోట శ్రీకాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇద్దరు వ్యవసాయ కూలీలు మృతి చెందడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రభుత్వం వీరి కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. పిడుగు పడిన ప్రాంతంలో మృతదేహాలను సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షుడు చిదంబర్‌రెడ్డి, మాజీ జడ్‌పిటిసి గొర్ల ఉపేంద్రారెడ్డి, వైస్ ఎంపిపి పొత్తూరి రవీంద్ర నాయుడు, సర్పంచ్ పాల వెంకట రమణ నాయుడు సందర్శించి నివాళు లర్పించారు.

జిల్లా అభివృద్ధికి సలహాలను స్వాగతిస్తున్నాం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి- రాయచోటి

అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధికి ఆలోచనలు, సలహాలు, సూచనలు స్వాగతిస్తున్నామని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో సమావేశ హాలులో స్వర్ణాంధ్ర-2047 జిల్లా విజన్ ప్లాన్ రూపకల్పనలో భాగంగా రాబోయే ఐదేళ్ల వరకు అన్నమయ్య జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ఉన్న అంశాలు, అవకాశాలు తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, స్వచ్ఛంధ సంస్థలు, వ్యక్తులు తదితరులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర-2047 ప్రణాళికలో భాగంగా రాష్ట్రాన్ని, జిల్లాలను అన్ని విధాల అభివృద్ధి చెందేందుకు ఒక విజన్ ప్రణాళికను రూపొందించడానికి నిర్ణయించారని చెప్పారు. ఈ మేరకు క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజల ఆలోచనలు, సూచనలు, సలహాలు తీసుకుంటున్నారన్నారు. ఇందులో మన జిల్లా నుంచి ఇప్పటికే వివిధ వర్గాలకు చెందిన దాదాపు 1.11 లక్షల మంది తమ ఆలోచనలు పంచుకున్నారు అన్నారు. మన జిల్లాకు సంబంధించి మండల స్థాయిలో ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. మన జిల్లాలో ఏ రకమైన వనరులు ఉన్నాయి, దేనిపైన మనం దృష్టి పెట్టాలి, 2047లో మన జిల్లాను రాష్ట్రంలో ఏ స్థానంలో ఉండాలని మనం కోరుకుంటున్నామ, ఒక్కొక్క జిల్లాకు ఒక్కొక్క రకమైన బలం ఉందని పేర్కొన్నారు. మన జిల్లాలో మైనింగ్, చక్కని మానవ వనరులు, ఉద్యాన పంటలు, అటవీ భూభాగం ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాను సమగ్ర అభివృద్ధి చేయడంలో మీ ఆలోచనలు విలువైన సూచనలు ప్రతిపాదనలు అందిస్తే వాటిని నివేదికలో పొందుపరిచి రాష్ట్రస్థాయికి పంపుతామని పేర్కొన్నారు. జిల్లాలో మనకున్న అవసరాలు, మన బలాలు, ఇంకా ప్రగతిలోకి తీసుకురావాల్సిన అంశాలపై మౌఖికంగా కానీ లేదా రాత మూలకంగా సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఇక్కడ సమావేశమైన వివిధ కేటగిరీ వారందరూ క్యూఆర్ కోడ్ ద్వారా స్వర్ణాంధ్ర - 2047 విజన్‌లో పాలుపంచుకునేలా మీ మీ గ్రూపులలో క్యూఆర్ కోడ్ పంపించి ఎక్కువమంది మన జిల్లా నుంచి ఈ ప్రణాళికలో భాగస్వాములు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకటపెద్దయ్య పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విజన్ ప్రణాళిక ప్రధాన ఉద్దేశంపై అవగాహన కల్పించారు. అనంతరం జిల్లా అధికారులు, రైతులు స్వచ్ఛంధ సంస్థలు ప్రజా ప్రతినిధులు తదితరులు జిల్లాకు సంబంధించి ఆయా అంశాలలో జిల్లాలోని పరిస్థితులు, అవకాశాలు తీసుకోవాల్సిన చర్యలపై తమ తమ ఆలోచనలు సలహాలు, సూచనలను వ్యక్తపరిచారు. చివరగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా అంశాలలో వివిధ సంస్థల ప్రతినిధులు వ్యక్తులు పలు అంశాలను చాలా చక్కగా చెప్పారని వారి నుంచి వచ్చిన ఆలోచనలు సలహాలు సూచనలను నోట్ చేసుకున్నామని, వాటిని రాత మూలకంగా సమర్పించాలని కోరారు. రైతుల గ్రూపులు, టీచర్లు డాక్టర్లు అంగన్వాడీలు మహిళా సంఘాలు పంచాయతీలు పారిశ్రామిక రంగం లేబర్ గ్రూప్స్ ఇతరత్రా గ్రూపులలో స్వర్ణాంధ్ర- 2047 క్యూఆర్ కోడ్ పంపించి అన్ని రంగాలలో జిల్లా విజన్ రూపొందించేలా పాలుపంచుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఆదర్స్ రాజేంద్రన్, డిఎఫ్ఒ వివేక్, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, ఆర్‌డిఒ రంగస్వామి, వివిధ శాఖల జిల్లా అధికారులు, రైతు గ్రూపులు, స్వఛారేద సంస్థలు, వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ఖతర్‌లో మహిళ కష్టాలు..!

- భర్త కడచూపునకు నోచుకోని వైనం
- ఒంటరైన 13 ఏళ్ల చిన్నారి
- ప్రభుత్వం స్పందించాలని వేడుకోలు



ఖతర్‌లో కష్టాలు పడుతున్న సాహిద, విలపిస్తున్న తల్లి ఖాదర్‌బి, కుమార్తె అర్షియ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ఖతర్‌లో వాల్మీకిపురంకు చెందిన మహిళ పడుతున్న కష్టాలు నరకయాతనం. తిండి లేక నరకం కన్నా.. ఘోరంగా ఇక్కడ పరిస్థితులు ఉన్నాయంటూ ఖతర్‌లో ఉన్న మహిళ సాహిద ఆవేదన వ్యక్తం చేస్తూ వీడియో ద్వారా తన తల్లికి గోడును మొరపెట్టుకుంది. వివరాలు.. వాల్మీకిపురం పట్టణం కొత్తఇందిరమ్మ కాలనీకి చెందిన సాహిద భర్త మౌల పెయింటింగ్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. వీరికి 13 ఏళ్ల కుమార్తె అర్షియ ఉంది. కొన్ని రోజుల తర్వాత మౌల చెడువ్యసనాలకు బానిస కావడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఏమి చేయాలో అర్థం కాక సాహిద అప్పులు చేసి రాయచోటికి చెందిన ఏజెంటు ద్వారా ఐదు నెలల క్రితం ఖతర్‌కు వెళ్లింది. అక్కడికి వెళ్లినప్పటి నుంచి కష్టాలు ఉన్నా కుటుంబం కోసం భరిస్తూ వచ్చింది. గత మూడు నెలల క్రితం తన భర్త మౌల మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సాహిద ఏజెంటు ద్వారా ఇండియాకు రావాలని ఖతర్‌లోని యజమానులతో మాట్లాడాలని ప్రాధేయపడిన ఫలితం లేకపోయింది. భర్త మౌల కడచూపుకు కూడా నోచుకోలేకపోయింది. భర్త మౌల చనిపోవడంతో తన కుమార్తె ఒంటరైపోయింది. సాహిద తల్లి ఖాదర్‌బి (75) చెంతన చేర్చుకొని రోజు కూలి పనులు చేస్తూ మనవరాలు అర్షియను పోషిస్తుంది. ప్రస్తుతం ఖతర్‌లో ఉన్న సాహిద అక్కడ తనకు భోజనం కూడా పెట్టకుండా పనులు చేయించుకుంటున్నారని, రోజు నీరు తాగి బ్రతుకుతున్నానని, ఇలాగే వదిలేస్తే అక్కడే ఆత్మహత్య చేసుకుంటానని సెల్ఫీ వీడియో పంపడంతో ఏమి చేయాలో అర్థం కాని తన తల్లి ఖాదర్‌బి, 13 ఏళ్ల కుమార్తె అర్షియ ఇంటి వద్ద కూర్చొని బోరున విలపిస్తున్నారు. వారి ఆర్థనాధాలు చుటుప్రక్కల వారిని కలిచివేస్తున్నాయి. ఈ దృశ్యాలు చూసిన ఇరుగుపొరుగు వాళ్లు ఆ చిన్నారిని ఎంత ఓదార్చిన తన తల్లి కోసం రోధిస్తున్న రోధనను ఎవ్వరూ ఆపలేకపోతున్నారు. ఇలాంటి కష్టం ఎవ్వరికీ రాకూడదని స్థానికులు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి సాహిదను ఇండియాకు రప్పించాలని తల్లి ఖాదర్‌బి, కుమార్తె అర్షియ కన్నీటిపర్యంతమవుతున్నారు.

నా బిడ్డను ఇంటికి రప్పించండి సారూ...!

చేసిన అప్పులు తీర్చాలని, కుమార్తెను బాగా చదివించుకోవాలని, పెళ్లి చేయాలని అప్పులు చేసి బయట దేశానికి వెళ్లింది. వెళ్లిన మూడు నెలలకే తన భర్త చనిపోయాడు. కుమార్తె ఒంటరైపోవడంతో నా దగ్గర పెట్టుకున్నాను. నాకు వయస్సు మీదపడింది. కూలి పనులు కూడా చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. పూట గడటం చాలా ఇబ్బంగా ఉంది. దయచేసి నా కుమార్తె సాహిదను దయగల దాతలు, ప్రభుత్వం స్పందించి ఇంటికి రప్పించండి సార్.

- ఖాదర్‌బి, సాహిద తల్లి, వాల్మీకిపురం

పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, నరసింహులు

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

ప్రపంచంలోని ప్రజాతంత్రవాదులందురూ పాలస్తీనా మీద ఒక సంవత్సరం నుండి ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఖండించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్.నరసింహులు సిపిఐ యం యల్ జిల్లా నాయకులు యం. విశ్వనాథ పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో సోమవారం పాత కోర్టు నుండి ప్రభుత్వ ఆసుపత్రి వరకు నిరసన ర్యాలీ చేపట్టి ధర్నా చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 1948కి ముందు ప్రపంచపటంలో అసలు ఇజ్రాయిల్ అనే దేశం లేదని, తలదాచుకోవడానికి స్థలం అంటూ ప్రవేశించి క్రమంగా ఆదేశాన్ని ఆక్రమించడం తీవ్ర దోహమన్నారు. చిన్న కారణాలు చూపి యుద్ధం మొదలుపెట్టి అక్కడి మహిళలు, పిల్లలు వృద్ధులు అనే విచక్షణ మరచి, పాఠశాలలు,ఆసుపత్రులు, దేవాలయాలు అన్నింటిపైన ఘోరంగా యుద్ధం చేయడాన్ని వ్యతిరేకించారు. అంతర్జాతీయ నియమాలను ఉల్లంఘించి అమెరికా వత్తాసుతో ఇజ్రాయిల్ జరుపుతున్న ఈదాడులను మానవత వాదులందరూ ఖండించాలని కోరారు. ప్రపంచంలోని అనేక విశ్వవిద్యాలయలలో పాలస్తీనాకు అనుకూలంగా సాగుతున్న సంఘీభావ ప్రదర్శనలను కొనియాడారు. మనదేశంలో కూడా ఇలాంటి సంఘీభావ కార్యక్రమాలు మరిన్ని జరపాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ఐక్యరాజ్య సమితి కఠిన చర్యలు తీసుకొని గతంలో అంగీకరించిన విధంగా సమస్యను పరిష్కరించాలని కోరారు. అమెరికా తన వాణిజ్య అవసరాలకు యుద్ధం కొనసాగాలని కోరుకూంటున్నదని, ఇజ్రాయిల్‌కు ఆయుధ సామగ్రి అమ్మి సొమ్ము చేసుకుంటున్నదన్నారు. రష్యా ఉక్రెయిన్ యుద్ధమైనా మరేఇతర యతరయుద్ధమైనా మానవజాతికి మప్పుతెస్తుందని పేర్కొన్నారు. ఐక్యరాజ్య సమితి అధ్యక్షుడిని ఇజ్రాయిల్ లోకి రానీయకపోవడం సరైనది కాదన్నారు. ప్రపంచదేశాలు ఇజ్రాయిల్ ను ఎండగట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజులు, మాధవయ్య, రెడ్డెయ్య నాగ బసిరెడ్డి, వెంకటరమణ, సిద్ధమల్లు, సిపిఐ నాయకులు రంగారెడ్డ, సుధీర్, సుమిత్ర, సిపిఐ (ఎంఎల్) నాయకులు పోసపాటి రమణ పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

'వీరశైవ సాహిత్యం-సామాజిక దృక్పథం' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్ : వీరశైవ సంప్రదాయాలకు పట్టం కట్టిన యుగం 'శివకవి యుగం' అని వైవీయూ ఇన్‌ఛార్జ్ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం అధీనంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సత్తెనపల్లి బాబు రచించిన 'వీరశైవ సాహిత్యం-సామాజిక దృక్పథం' అనే పుస్తకావిష్కరణ సభ సోమవారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ సత్తెనపల్లి బాబు రచించిన గ్రంథంలో వీరశైవమత సిద్ధాంత లక్షణాలను తెలిపి సాహిత్యంలో అవి ప్రతిఫలించిన తీరును విశ్లేషించారన్నారు. కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ నన్నెచోడుడు, మల్లికార్జున పండితారాధ్యుడు, పాల్కురికి సోమన అనే ముగ్గురు కవులు శివకవి యుగంలో కవిత్రయంగా పేరు గాంచారన్నారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సోమవారం పాత బస్టాండ్ కూడలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదేళ్ల బాలుడు మృతి చెందిన ఘటన పట్టణంలో చోటు చేసుకుంది. వివరాలు.. చిన్న ఓరంపాడుకు చెందిన బాబురామ్, శిరీషల పెద్ద కుమారుడు శ్యామ్ (5)కు అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం రాజంపేటలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చూపించారు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని తిరుగు ప్రయాణమయ్యే సమయంలో పాత బస్టాండు కోడలి వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో బాలుడు కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో తల్లిదండ్రులు, బంధువుల ఆర్తనాదాలు ప్రభుత్వ ఆసుపత్రిలో మిన్నంటాయి.

రోధిస్తున్న తల్లి శిరీష

డిఎఫ్ఒ వివేక్‌ను సన్మానిస్తున్న కలెక్టర్, జెసి, సబ్ కలెక్టర్లు

డిఎఫ్ఒ వివేక్ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - రాయచోటి

బదిలీపై వెళ్తున్న డిఎఫ్ఒ వివేక్ జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని కలెక్టర్ శ్రీధర్ చామకూరితో పాటు పలువురు కొనియాడారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో డిఎఫ్ఒ పి.వివేక్ బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన జిల్లాలో డిఎఫ్ఒ వివేక్ తన విధులను అత్యంత సమర్థవంతంగా నిర్వహించారని, ఆయన జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసే సమీక్ష సమావేశాలలో అటవీ శాఖకు సంబంధించిన అంశాలలో వేగవంతంగా చర్యలు తీసుకుని జిల్లా యంత్రాంగానికి తన వంతు సహాయ సహకారాలు అందించేవారని తెలిపారు. జెసి డిఆర్ఒ సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఒ, వివిధ శాఖల అధికారులు డిఎఫ్ఒ సేవలను కొనియాడారు. చివరగా డిఎఫ్ వివేక్ మాట్లాడుతూ జిల్లాలో తాను విధులు నిర్వర్తించిన కాలంలో జిల్లా ఉన్నత స్థాయి అధికారులు, జిల్లా యంత్రాంగం పూర్తిగా తనకు సహాయ సహకారాలు అందించి తోడ్పాటును అందించినందుకు తన కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆయన్ను పూల మొక్కలు, శాలువలతో కలెక్టరు, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ సత్యనారాయణ రావు, సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, రంగస్వామి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి 'మండిపల్లి'కి రైతుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పీలేరు

క్రీడలు, యువజన, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి రైతుల తరపున పీలేరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోధిషావలి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఆయన పీలేరులో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ప్రతి ఏటా దాదాపు లక్ష హెక్టార్లలో వేరుశనగ సాగు అవడం జరుగుతుందని, ప్రతి సంవత్సరం అతివృష్టి, అనావృష్టి ఫలితంగా రైతులు పంట నాణ్యతను, దిగుబడిని కోల్పోతున్నారన్నారు. ఈ సంవత్సరం కూడా ఆశాజనకంగా వర్షాలు కురవకపోవడంతో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని చెప్పారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంట సాగు కోసం జిల్లాకు 9,500 కింటాళ్ళ ఉలవలు కేటాయించగా, క్షేత్రస్థాయిలో జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఈ ఏడాది కూడా వేరుశనగ పంట నష్ట తీవ్రతను గుర్తించిన జిల్లా వాసి అయిన రాష్ట్ర మంత్రి పరిస్థితిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి జిల్లాకు అదనంగా 6,000 క్వింటాళ్ల ఉలవలను తెప్పించడం సంతోషదాయకమని జిల్లాలోని రైతుల తరపున పీలేరుకు చెందిన ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోధిషావలి ఈ సందర్భంగా మంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సమస్యలు తెలుసుకుంటున్న జెసి ఆదర్శ రాజేంద్రన్

సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- జెసి ఆదర్శ రాజేంద్రన్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి సంబంధించి ఎప్పటికప్పుడూ అర్జీదారుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జెసి అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ సత్యనారాయణరావు, ఆర్‌డిఒ రంగస్వామి , వివిధ శాఖల, అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్ర రంజీ జట్టుకు రఫీ ఎంపిక

ప్రజాశక్తి - కడప

ఆంధ్ర రంజీ జట్టుకు కడపకు చెందిన ఎస్.ఎం.డి రఫీ ఎంపికయ్యారు. ఈ నెల 11 నుండి నాగపూర్‌లో జరిగే రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో రఫీ ఆంధ్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ఆంధ్ర రంజీ జట్టుకు కడప నుంచిరఫీ ఎంపిక కావడం పట్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.భరత్ రెడ్డి, కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్, అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

- సమగ్ర శిక్ష అభియాన్ జెఎసి జిల్లా అధ్యక్షులు మురళీమోహన్‌రాజు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

మూడు నెలలు గడుస్తున్నా ఇంత వరకూ తమ జీతాల పట్ల ఏ స్పందన లేదని, గత సమ్మె కాలంలో 22 రోజుల జీతాన్ని అధికారులు వెంటనే మంజూరు చేయాలిన సమగ్ర శిక్ష అభియాన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు మురళీమోహన్ రాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన తమ యూనియన్ సభ్యులతో, సిఐటియు నాయకులతో కలిసి స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యా శాఖలో తామే ప్రధాన భూమికను పోషిస్తున్నామని, అయినా అధికారులు తమపై చిన్న చూపు చూస్తున్నారని వాపోయారు. అధికారులకు ఒకటో తారీఖున జీతాలు చెల్లిస్తుంటే, గాడిద చాకిరీ చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న తమకు మాత్రం నెలల తరబడి జీతాలు ఇవ్వకుండా కాలయాపన చేయడం దారుణమని పేర్కొన్నారు. ఇలా ఎంత కాలం తమ చిరు ఉద్యోగస్తుల జీవితాలతో అధికారులు ఆడుకుంటారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలు గడుస్తున్నా ఇంతవరకు తమకు జీతాలు ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. అంతేకాక సాధారణ డిమాండ్లను కూడా ఇంతవరకు నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. ముఖ్యంగా ఇటీవల మదనపల్లిలో ఒక సిఆర్ఎంటి వీధి నిర్వహణలో చనిపోతే ఇంతవరకు బాధిత కుటుంబానికి ఎలాంటి సాయం అందించలేదని పేర్కొన్నారు. చేయలేదన్నారు. కోడూరు డేటా ఎంట్రీ ఆపరేటర్ విధి నిర్వహణలో గాయాలపాలై కదలలేని స్థితిలో ఉంటే, ఆయన కుటుంబానికి తోడుగా ఉండాల్సింది పోయి కనీసం జీతం కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదే ఒక గవర్నమెంట్ ఉద్యోగికి ఏమన్నా జరిగితే ఊరుకుంటారా అని ప్రశ్నించారు. చిరు ఉద్యోగులమైన తమపై అధికారులు కక్షసాధింపు చర్యలు మానుకోవాలని పేర్కొన్నారు. ప్రతినెలా ఒకటో తారీకునే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు మాట్లాడుతూ సమగ్ర శిక్ష అభియాన్‌లో ఏ కార్మికునికి అన్యాయం జరిగినా తాము ముందుండి అధికారులు ప్రశ్నించడమే కాకుండా, వారికి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని తెలియజేశారు. కొంతమంది విద్యాశాఖ అధికారులు చిరు ఉద్యోగుల పట్ల వివక్షతను విడనాడాలని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించేంతవరకు సిఐటియు నిరంతరం పోరాటం చేస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీనివాసులు, సమగ్ర శిక్ష అభియాన్ ఉపాధ్యక్షులు వెంకటరమణ కార్యదర్శి అలీ హుస్సేన్, సభ్యులు ప్రదీప్, గుప్త, నరేంద్ర రాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు భాస్కర్

మండలాలకు అధ్యక్షులను నియమిస్తాం : డిసిసి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులను త్వరలో నియమించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్, నియోజకవర్గ అభ్యర్థి గోశాల దేవి అన్నారు. జిల్లా అధ్యక్షులు గాజుల భాస్కర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు ఎన్.శాంతయ్య రైల్వేకోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గోసాలదేవి, మాజీ మండల అధ్యక్షులు దార్ల సయ్యద్ అష్రఫ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల నాయకుల నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిని, ఐదు మండలాల అధ్యక్షులు నియామకం కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అందరూ కలిసి రైల్వేకోడూరు నియోజకవర్గంలో 2029లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుల్లంపేట మండల నాయకులు సింగమల రమేష్, రైల్వేకోడూరు నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు నన్నం శివకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు రాజుబోయిన శ్రీకాంత్, దాసరి సుబ్రహ్మణ్యం, బొమ్మి వెంగయ్య, ఉప్పుటూరి బ్రహ్మయ్య, ఉప్పుటూరి ఆదిలక్ష్మి, నన్నం శివ, రైల్వేకోడూరు విద్యార్థి నాయకులు సింగమల శివ, బొమ్మి రాజేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం సమర్పిస్తున్న గ్రామస్తులు

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి-కలికిరి

జంగంపల్లి గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎంపిడిఒ భానుమూర్తిరావుకు జంగంపల్లి దళితవాడకు చెందిన గ్రామస్తులు విన్నవించుకున్నారు. మండలంలోని గుట్టపాళ్యం పంచాయతీ జంగంపల్లి, జంగంపల్లి దళితవాడలో రెండు మూడు నెలలుగా తాగునీటి ఎద్దడి ఏర్పడింది. గ్రామస్తులకు తాగునీరు లేక వ్యవసాయ బోరు బావుల దగ్గర నీళ్లు తెచ్చుకుంటూ పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్య పరిష్కరించాలని రెండు నెలల క్రితం ఇప్పటికే ఒకసారి మునుపటి ఎంపిడిఒకు విన్నవించుకోగా ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని, తాగునీటి బోర్ లోతు తక్కువగా ఉన్నందున నీళ్లు సక్రమంగా రావడంలేదని కొత్త బోరు వేసి తాగునీటి ఎద్దడి అరికట్టాలని మాజీ సర్పంచ్ కె.వెంకటరామారెడ్డి ఆధ్వర్యంలో ఎంపిడిఒను కోరారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ అధికారులతో సంప్రదించి త్వరగా నీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పద్మ కుమార్, ప్రహ్లాద, దళితవాడకు చెందిన వేణు, చెన్నయ్య, శివ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

అగ్ని ప్రమాదాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక ఇన్‌ఛార్జి అధికారి రామయ్య పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని గ్లోబల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన విన్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విన్యాసాల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఇంటి వద్ద అగ్గిపుల్లలతో ఆడుకోకూడదని చిన్న నిప్పులు పెద్ద మంటగా ఏర్పడి ఇండ్లలోని గ్యాస్ సిలిండర్ పేలి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని, చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు దూరంగా ఉంచాలన్నారు. పెద్ద పెద్ద పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా ఎదుర్కోవాలి అన్న విషయాలు విన్యాసాలు చేసి చూపించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ దక్షాయని, ఉపాధ్యాయులు, ఫైర్ సిబ్బంది సుదర్శన్ రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

'బాలకార్మికుల విముక్తి కోసమే ఆపరేషన్ స్వేచ్ఛ'

ప్రజాశక్తి-వి.కొత్తకోట

బాలకార్మికులకు విముక్తి కల్పించడమే ఆపరేషన్ ముస్కాన్ ఉద్దేశ్యమని ఎఎస్ఐ బొజ్జా నాయక్ స్పష్టం చేశారు. సోమవారం సిఐ రాజారెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని వివిధ దుకాణాల్లో పనిచేస్తున్న బడిఈడు పిల్లలను, వారి తల్లిదండ్రులను పిలిపించి అప్పగించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ బొజ్జా నాయక్ మాట్లాడుతూ జి.చరణ్, కె.సైఫుల్లా, పి.దినేష్ అనే 10వ తరగతి చదువుతున్న చిన్నారులు వివిధ పనిచేస్తుండగా పోలీసుస్టేషనుకు తీసుకొచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించి అవగాహన కల్పించామన్నారు. బడిఈడు పిల్లలను పనుల్లో పెట్టుకుంటే దుకాణ యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. చిన్నారులు తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ప్రజలు తమ సమీప ప్రాంతాల్లో ఎవరైనా చిన్నారులు దుకాణాల్లో పనిచేస్తున్నట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

మదనపల్లె అర్బన్ : పోలీసు, స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ స్వేచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నీరుగట్టువారిపల్లి, మాయాబజార్, ఇందిరానగర్ ప్రాంతాల్లో బాలకార్మికులు వెట్టి చాకిరీ చేసేవారు ఉంటే వారికి విముక్తి కోసం ఆపరేషన్ స్వేచ్ఛ కొనసాగించారు. లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుస్సేన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ రమాదేవి, పోలీస్ సిబ్బంది, చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అడ్మిన్ డైరెక్టర్ డాక్టర్ జి.వి.ఎస్ బాబు, జనరల్ సెక్రటరీ కవిత రాణి, సిబ్బంది రెడ్డి ప్రసన్న, విక్టర్ ఇమ్మానుయేల్, గ్రామజ్యోతి సొసైటీ సుభద్రలు పాల్గొన్నారు. దుకాణాల యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహిళా పోలీస్ వీణ, కిరణ్ పాల్గొన్నారు.

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎఎస్ఐ బజ్జ నాయక్

సచివాలయాల్లో ఉచిత ఇసుక బుకింగ్ పోర్టల్

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాలో ఉచిత ఇసుక కోసం ఎపి శాండ్ మేనేజ్మెంట్ వెబ్ పోర్టల్ ద్వారా, లేదా సచివాలయాలలో దరఖాస్తు చేసుకోవచ్చని, త్వరలో మరో మూడు ఇసుక రీచ్‌లలో అందుబాటులోకి రానున్నాయని కలెక్టర్ శ్రీధర్ చామకూరి మీడియా ప్రతినిధుల సమావేశంలో పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో జిల్లాలో అమలవుతున్న ఇసుక పాలసీ, రవాణా, ఇసుకను దరఖాస్తు చేసుకునే విధానం, తదితర అంశాలపై కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో ఉచిత ఇసుక పాలసీ పటిష్టంగా అమలవుతోందని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో ఇప్పటి వరకు మూడు ఇసుక రీచ్‌లున్నాయని, మరో మూడు ఇసుక రీచ్‌లను ఈనెల 16లోగా అందుబాటులోకి తేనున్నామన్నారు. రాజంపేట మండలం బోడిగుంటపల్లి గ్రామం నుంచి రోజూ 6 వేలు మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా అవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులోకి తెచ్చామని, మరో మూడు ఇసుక రీచ్‌లలో అందుబాటులోకి వస్తే మరో 75 వేల మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ ఉంటుందని తెలిపారు. ఇసుకను ఉచితంగా ఇస్తున్నామని దరఖాస్తుదారుడు నిర్వహణకు ఒక టన్నుకు రూ.307 మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అన్నమయ్య జిల్లాలోనే ఇంత తక్కువ మొత్తంలో నిర్వహణ ఖర్చు ఉందని తెలిపారు. అవసరమైన వారు పోర్టల్‌లో కానీ, సచివాలయాల్లో ఆదివారం నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఎక్కడికి రవాణా చేయాలి అనే అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నారని అన్నారు. ప్రభుత్వ వాహనంతో రవాణా కొరకు దరఖాస్తు చేసుకునేటప్పుడు దరఖాస్తుదారు ఎక్కడ ఉన్నారు అనే అంశాన్ని తెలపాల్సిన అవసరం లేదని, ఇసుకను ఎక్కడికి రవాణా చేయాలి అని అంశాన్ని స్పష్టంగా పేర్కొన్నాలన్నారు. సమావేశంలో ఏడి మైన్స్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

మోహిని అలంకారంలో శ్రీకన్యకా పరమేశ్వరి

ప్రజాశక్తి-నందలూరు

శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఐదవ రోజు సోమవారం రాత్రి తోటోత్సవం, మోహిని అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆలయ అర్చకులు చెరుకుముడి మృత్యుంజయ రావు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం మహిళలు సహస్రనామ కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తమ మొక్కలను తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు. రాత్రి ఉదయదారులుగా గెలివి నాగరత్నం శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. అనంతరం అల్పాహార విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులు యంబలూరు నరసింహ ప్రసాద్, మంచి కంటి నారాయణ, యువజన సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు భూపాలం సునీల్ కుమార్, గెలివి లోకేష్, ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.



గుర్రంకొండ : మహాలక్ష్మీదేవిగా రెడ్డెమ్మ

రామాపురం : మండలంలోని నీలకంఠపేట సమీపంలో శరన్నవరాత్రి దసరా ఉత్సవాలలో భాగంగా సోమవారం మోహిని దేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు ఆలయంలో అర్చకులు పూజలు అభిషేకాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహాలక్ష్మీ దేవిగా రెడ్డెమ్మ

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో వెలసిన రెడ్డమ్మ దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఐదవ రోజు మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం నిర్వహించి, పరిమళభరిత పుష్పాలతో ఉత్సవ మూర్తిని సర్వాంగ సుందరంగా అలంకరించారు. తదుపరి సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఐశ్వర్యానికి అధిష్టాన దేవత అయిన అభయ హస్త ముద్రలో ఉన్న ఈ తల్లిని ఆరాధిస్తే అష్టైశ్వర్యాలు, సకల సంపదలు చేకూరుతాయని అర్చకులు మహాలక్ష్మీ దేవి యొక్క విశిష్టతను భక్తులకు వివరించారు పూజలో పాల్గొన్న భక్తులందరికీ తీర్థప్రసాదాలు, అన్నప్రసాద వితరణ చేశారు. ఆరవ రోజు లలితాత్రిపుసుందరీ దేవిగా దర్శనమిస్తారని ఆలయ ఇఒ మంజుల తెలియజేశారు.

ఆక్రమణలు సత్వరమే తొలగించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ప్రసిద్ధిగాంచిన మదనపల్లె టమోటా మార్కెట్ యార్డులో అక్రమ నిర్మాణాలను ఎమ్మెల్యే షాజహాన్ బాషా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఆసియాలోనే టొమోటో ఎగుమతుల్లో అగ్రగామిగా పేరు పొందిన మదనపల్లి వ్యవసాయ టొమోటో మార్కెట్ యార్డును సోమవారం ఆకస్మికంగా పరిశీలించడం జరిగింది. ఇందులో భాగంగా బాధ్యతా రాహిత్యంగా విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి వైఖరిని ఎండగట్టారు. నిర్లక్ష్యంగా విధులు నిర్వహించడం పైన యార్డ్ సూపర్‌వైజర్, వాచ్‌మెన్ లను సస్పెన్షన్‌కు సిఫార్సు చేశారు. అంతేకాకుండా మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్లు వారికి కేటాయించిన స్థలం కంటే ఎక్కువగా ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడితే మార్కెట్ అసోసియేషన్ ఏమి చేస్తోందని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడే విధంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే 24 గంటల్లోపు అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండీ యజమానులు ముసలికుంట నాగయ్య, మార్కెట్ కార్యదర్శి అబిలాష్, సంగం శ్రీనివాసులు, ముంబై దుర్గ, సూరి, మంజు, కమీషన్ ఏంజెట్లు, రైతులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

వాల్మీకి బోయలపై ప్రభుత్వాల వివక్ష తగదు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోవిందు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకి బోయల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇంకెన్నాళ్లు వివక్ష చూపుతాయని వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధికార కోర్ కమిటీ సభ్యులు నాగినేని గోవింద్, యూత్ వింగ్ నక్కా మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మనపల్లె లక్ష్మన్న ప్రశ్నించారు. సోమవారం స్థానిక ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గిరిజన రిజర్వేషన్ల అంశంలో ఏ జాతికి లేని అశాస్త్రీయమైన ఏజెన్సీ, మైదాన ప్రాంతం అనే నిబంధన వాల్మీకి బోయల రిజర్వేషన్ల అమలులో మాత్రం ఎందుకు అని మండిపడ్డారు. వాల్మీకుల రిజర్వేషన్ల అంశంలో రాజ్యాంగాన్ని అనుసరించి అధికరణలు 14, 15, 16, 29(1), 342లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రొఫెసర్ సత్యపాల్ కమిటీ, కారం శివాజీ కమిటీ రిపోర్టు ఆధారంగా వాల్మీకి బోయలను గిరిజన తెగల జాబితాలో చేరుస్తామని గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు వాల్మీకులకు ఇచ్చిన హామీని వెంటనే నిలబెట్టు కోవాలన్నారు. 2019 కర్నూలు సభలో బోయల బాధ నాకు తెలుసని, బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే తగు న్యాయం చేస్తామని సాక్షాత్తూ ప్రధాని మోడి హామీ ఇచ్చి ఐదేళ్లు గడుస్తున్నా ఇంత వరకు హామీ నిలబెట్టుకోలేదన్నారు. వాల్మీకి బోయల గిరిజన రిజర్వేషన్ల అంశంలో కేంద్ర ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోకపోవడం లో ఆంతర్యమేమో గత 60 ఏళ్లుగా గిరిజన రిజర్వేషన్ల పునరుద్ధరణ కోసం పోరాడుతున్న ప్రభుత్వాలు దయ చూపలేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈ నెల 17న వాల్మీకి జయంతి లోపు తగు నిర్ణయం తీసుకొని వాల్మీకి బోయలకు తగు న్యాయం చేయాలని డిమాండు చేసారు. లేని పక్షంలో లక్షల మంది వాల్మీకి బోయల ఆగ్రహానికి గురికావల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లికార్జున, పరేసు గోపాల్, రాజగోపాల్, చెన్నం వెంకట్రమణ, కొత్తూరు చిన్న రెడ్డప్ప, మేకల లక్ష్మినారాయణ, వాల్మీకి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ మ్యాచ్‌లు

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎసిఎ అండర్ - 14 ప్లేట్ గ్రూప్ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైన మ్యాచ్‌లో పి. రాజ్ మోహన్ డబల్ సెంచరీ చేయడంతో ప్రకాశం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 405 పరుగుల భారీ స్కోరు సాధించింది. కడప, ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్ సోమవారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ప్రకాశం జట్టు 90.0 ఓవర్లలో మొదటి ఇన్నింగ్స్ లో 8 వికెట్ల నష్టానికి 405 పరుగులు చేసింది. ఆ జట్టులోని పి. రాజ్ కుమార్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 220 బంతులను ఎదుర్కొని 33 బౌండరీల సహాయంతో డబల్ సెంచరీ (208 పరుగులు) చేశాడు. మరో బ్యాట్‌మెన్ ఆర్. హేమంత్ రాయల్ 107 పరుగులు (సెంచరీ) చేశాడు. కడప జట్టులోని సాయి కృష్ణ చైతన్య 3, అజ్మత్ అలీ ఖాన్ రెండు వికెట్లు తీసుకున్నారు.

కెఎస్ఆర్ఎమ్ క్రికెట్ మైదానంలో వెస్ట్ గోదావరి, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 62.0 ఓవర్లలో 120 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రిత్విక్ రెడ్డి 41 (నాట్ అవుట్), జితేష్ సాయి వల్లభన్ 24 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని తేజేష్ అదుతేంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. మోహిత్ సాయి 2, దినేష్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 37.5 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసింది. ఆ జట్టులోని శ్రీవంత్ రెడ్డి 52 (నాట్ అవుట్), తనీశ్వర్ టెండూల్కర్ 27 (నాట్ అవుట్) పరుగులు చేశారు.

వైఎస్ఆర్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో విశాఖపట్నం, ఈస్ట్ గోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఈస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 66.2 ఓవర్లలో 259 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని కార్తీక్ 109 పరుగులు (సెంచరీ) చేశాడు. కృష్ణ సాకేత్ రెడ్డి 129 (సెంచరీ) పరుగులు చేశాడు. విశాఖపట్నం జట్టులోని మనోజ్ నాయుడు 3, ప్రఖ్యాత్ వర్మ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 23.0 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. ఆ జట్టులోని తమన్ రెడ్డి 48, ముఖేష్ కుమార్ 33 పరుగులు చేశారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ మద్యం దుకాణాల నిర్వహణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీలేరు ప్రొహిబిషన్స్, ఎక్సైజ్ సిఐ వి.సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ప్రొహిబిషన్స్, ఎక్సైజ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా, పీలేరు సర్కిల్ పరిధిలోని పీలేరు మండలంలో 6, కలకడ మండలం 2, కెవి పల్లి మండలంలో ఒకటి చొప్పున మొత్తం 9 మద్యం దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ గజెట్ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా https://hpfsproject.comలో ఆన్ లైన్ లేదా ఆఫ్ లైన్ విధానంలో, రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్ రిజిస్ట్రేషన్ ఛార్జ్ గా చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఒక వ్యక్తి ఒక షాపుకి ఎన్ని దరఖాస్తులైనా, ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా దరఖాస్తులు సమర్పించవచ్చని పేర్కొన్నారు. ఒక వ్యక్తి లాటరిలో ఒక వ్యక్తి ఎన్ని షాపులైనా దక్కించుకోవచ్చని చెప్పారు. లాటరీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, ఎలాంటి అపోహలకు తావు లేకుండా, ప్రభుత్వ నియమ, నిభందనల ప్రకారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన రాయచోటి - చిత్తూరు మార్గంలోని లయ గార్డెన్స్, పుష్యమి గ్రూప్ అఫ్ ఫంక్షన్ హాల్లో నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ఒక వేళ దరఖాస్తు సమర్పించుటకుగానీ లేదా లాటరీ ప్రకియ రోజు గానీ అభ్యర్థి రాలేని పక్షంలో, ఒక అఫిడవిట్ సమర్పించి అతని తరపున వేరే వ్యక్తిని పంపవచ్చని పేర్కొన్నారు. కావున ఆసక్తి గల అభ్యర్థులు మద్యం షాపుల కోసం దరఖాస్తులు సమర్పించవలసిందింగా కోరారు.

నూతన అధికారుల నియామకం

జిల్లాలో ఆయా మండలాలకు నూతన అధికారులు నియమితులయ్యారు. ఎంపిడిఒలు, స్పెషల్ ఆఫీసర్లు, ఇఒలు, డిప్యూటీ తహశీల్దార్లు ఇలా పలువురు అధికారులు బదిలీపై మండలాల్లో సోమవారం బాధ్యతలు చేపట్టారు.

నిమ్మనపల్లె ఎంపిడిఒగా పరమేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : మండల అభివృద్ధి అధికారిగా జి.పరమేశ్వర్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా గతంలో ఇక్కడ పనిచేస్తున్న పి.శేషగిరిరావు వడమాలపేట మండలానికి బదిలీ కాగా, కలకడ మండలంలో పనిచేస్తున్న జి.పరమేశ్వర్‌రెడ్డి నిమ్మనపల్లి ఎంపిడిఒగా బాధ్యతలను చేపట్టారు. ఎఒ రమేష్ బాబు, ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, టిడిపి మండల అధ్యక్షులు పుర్రా వెంకటరమణ, రాజంపేట పార్లమెంట్ బిసి అధికార ప్రతినిధి లక్ష్మన్న, మాజీ సర్పంచ్ శ్రీరాములు, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎంపిడిఒకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల అభివృద్ధికి స్థానిక అధికారులతో, ప్రజా ప్రతినిధులతో కలిసి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలకు అందేలా చర్యలు చేపడ తామన్నారు. గ్రామాలలో శుద్ధమైన త్రాగునీరు అందించటానికి ప్రయత్ని స్తామన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను విరివిగా చేపట్టి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కలకడ ఎంపిడిఒగా అబ్దుల్ రహీం

ప్రజాశక్తి- కలకడ: మండల అభివృద్ధి అధికారిగా పి.అబ్దుల్ రహీం బాధ్యతలు చేపట్టారు. గతంలో కలకడ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ ఉండిన జి.పరమేశ్వర్‌రెడ్డి నిమ్మనపల్లి ఎంపిడిఒగా బదిలీ అయ్యారు. ఇతని స్థానంలో పెద్దపంజాణి మండలం ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ ఉండిన పి.అబ్దుల్ రహీం కలకడ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒ అబ్దుల్ రహీం మాట్లాడుతూ మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై దృష్టి సారించి వాటిని పూర్తి చేయడానికి సహకరిస్తానని తెలియ జేశారు.ఉపాధి హామీ ద్వారా జరుగుతున్న పనులను సమీక్షించి కూలీలకు న్యాయం చేసే విధంగా పనిచేస్తాయని తెలియజేశారు.

పుల్లంపేట ఎంపిడిఒగా జయశ్రీ

ప్రజాశక్తి-పుల్లంపేట: మండల ఎంపిడిఒగా పోతుగుంట జయశ్రీ బాధ్యతలు స్వీకరించారు. జయశ్రీ సాధారణ బదిలీల్లో భాగంగా వల్లూరు నుంచి పుల్లంపేటకి బదిలీ అయినట్లు తెలియజేశారు. ఇక్కడ పనిచేస్తున్న రఘురాం వల్లూరుకు బదిలీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జయశ్రీ మాట్లా డుతూ ప్రజా పరిష్కార వేదిక సమస్యలపై వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించి మండల ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం జరుగుతుందని తెలియజేశారు. ప్రజా సమస్యలు, సంక్షేమం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి చేపడతానని తెలియజేశారు.

సర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా భార్గవి

ప్రజాశక్తి- కలకడ: రీ సర్వే డిప్యూటీ తహశీల్దారుగా ఎం.భార్గవి బాధ్యతలు చేపట్టినట్లు తహశృల్దార్ ఫణి కుమార్ తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర బదిలీపై పీలేరుకు వెళ్లడంతో ఖాళీ ఏర్పడినట్లు తెలిపారు. ఆ స్థానంలో కె.వి.పల్లి మండలంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తూ ఉండిన భార్గవి పదోన్నతిపై రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా కలకడకు బదిలీపై వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ డిటి మాట్లాడుతూ రైతులకు ఉన్న భూ సమస్యలపై దృష్టి సారించి సమస్యలు పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

మేజర్ గ్రామ పంచాయతీ ఇఒగా అశోక్

ప్రజాశక్తి-కలికిరి : కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ ఇఒగా అశోక్ పదవి బాధ్యతలు చేపట్టారు. ఉదయం ఆయన పంచాయతీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కలికిరి ఎంతో అభివృద్ధి చెందు తున్నదని మేజర్ పంచాయతీలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ఎటువంటి అసౌకర్యాలుకు లోను కాకుండా సరైన మౌలిక వసతులు కల్పిస్తూ, త్రాగునీరు, రోడ్లు, శానిటేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ మోడల్ పంచాయతీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానన్నారు. పంచాయతీ అధికారులు, సిబ్బంది, ప్రజలు సహకరించాలని కోరారు. ఇఒగా పనిచేసిన గురు మోహన్ పీలేరు మేజర్ పంచాయతీ ఇఒగా బదిలీ కాగా స్థానంలో అశోక పులిచర్ల నుండి ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎల్లయ్య, టిడిపి యువ నాయకులు వైజాగ్ భాష తదితరులు ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇరిగేషన్ డిఇఇగా శావలా నాయక్

ప్రజాశక్తి-పీలేరు: నీటిపారుదల శాఖ పీలేరు డివిజన్ డిఇఇగా ఎం.శావలా నాయక్ బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో డిఇఇగా పనిచేస్తూ ఆయన పీలేరుకు బదిలీపై వచ్చారు. పీలేరులో ఇరిగేషన్ శాఖ డిఇఇగా పనిచేస్తున్న ప్రసన్నకుమారి సత్యసాయి జిల్లా, కదిరికి ఇరిగేషన్ శాఖ డిఇఇగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా శావలా నాయక్ మాట్లాడుతూ పీలేరు ఇరిగేషన్ డివిజన్ స్థాయి సమస్యలను తన సిబ్బంది సహకారంతో పరిష్కరించడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

చిన్నమండెం ఇఒపిఆర్‌డిగా శేఖర్‌నాయక్

ప్రజాశక్తి-చిన్నమండెం : మండల పంచాయతీ విస్తరణ అధికారిగా బాధ్యతలు శేఖర్ నాయక్ బాధ్యతలు స్వీకరించారు. గాలివీడు మండలంలో పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా చిన్నమండెం మండలానికి ఇఒపిఆర్‌డిగా వచ్చారు. ఆయనను ఎంపిడిఒ కార్యాలయ సిబ్బంది అభినందించారు.

హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్‌గా మధుసూదన్

ప్రజాశక్తి-కలికిరి: హౌసింగ్ స్పెషల్ ఆఫీసర్‌గా పంచాయతి రాజ్ డిఇ మధుసూదన్ నియమించినట్లు ఎంపిడిఒ భానుమూర్తి రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కలికిరి ఎంపిడిఒ కార్యాలయంలో హౌసింగ్, పిఆర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పెండింగ్లో ఉన్న ఇండ్లను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశిం చారు. అనంతరం పల్లవోలు, గుండ్లూరు, చీకటి పల్లి, పారపట్ల గ్రామ పంచాయతీలను సంద ర్శించి సిసి రోడ్ల కొరకు ప్రపోజల్ పెట్టిన వాటిని పరిశీలించారు. వీలైనంత త్వరగా అనుమతులు తీసుకుని వచ్చి సిసి రోడ్లు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హౌసింగ్ ఎఇ వెంకటేష్, పిఆర్ ఎఇబాషా పాల్గొన్నారు.

రామాపురం ఇఒపిఆర్‌డిగా పట్నాయక్

ప్రజాశక్తి-రామాపురం : మండల పంచాయతీ విస్తరణ అధికారిగా పట్నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఆయన లక్కిరెడ్డిపల్లె మండలంలో ఇఒపిఆర్‌డిగా పని చేస్తూ బదిలీపై రామాపురానికి వచ్చారు. ఇక్కడ ఇఒపిఆర్‌డిగా పనిచేస్తున్న ఉషారాణి లక్కిరెడ్డిపల్లి ఇఒపిఆర్‌డిగా బదిలీ అయ్యారు.

వైవీయూ బీటెక్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - కడప అర్బన్ : వైవీయూ ప్రొద్దుటూరు, ఇంజినీరింగ్ కళాశాల బిటెక్ 2,4, సెమిస్టర్, బిటెక్ డిప్లొమా 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఎన్.ఈశ్వర్‌రెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జయరాంరెడ్డితో కలిసి సోమవారం విడుదల చేశారు.